త్రిసా, గాయత్రి జోడీ సంచలనం

- పీవీ సింధుకు చుక్కెదురు

సింగపూర్: సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ పోరులో గాయత్రి, త్రిసా ద్వయం 21-9, 14-21, 21-15తో ప్రపంచ రెండో ర్యాంకర్ జోడీ బేక్ హ న- లీ సో హీ(దక్షిణ కొరియా)ను ఓడించి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. దాదాపు గంట పాటు హోరాహోరీగా సాగిన పోరులో తమ(30వ ర్యాంక్) కంటే మెరుగైన ర్యాంక్‌లో కొరియా జంటను తొలిసారి ఓడించి టోర్నీలో ముందంజ వేశారు. ఎక్కడా తడబాటుకు లోనుకాని గాయత్రి, త్రిసా తొలి గేమ్‌ను అలవోకగా కైవసం చేసుకున్నారు. రెండో గేమ్‌లో పుంజుకున్న కొరియా జోడీ అనూహ్యంగా పోటీలోకి వచ్చింది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో గాయత్రి, త్రిసా..ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. మరోవైపు అచ్చొచ్చిన సింగపూర్ ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చుక్కెదురైంది. సింగిల్స్ రెండో రౌండ్‌లో సింధు 21-13, 11-21, 20-22తో కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో ఓడింది. కీలక టోర్నీలలో సింధుకు కొరకరాని కొయ్యలా మారిన మారన్.. తొలి గేమ్ ఓడినా తర్వాత పుంజుకుని వరుస గేమ్‌లలో గెలిచి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రణయ్ 13-21, 21-14, 15-21తో కెంటా నిషిమొటో(జపాన్) చేతిలో ఓడాడు.

సబలెంకా, జొకో జోరు

పారిస్: పారిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడ్ల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ టోర్నీలో అదరగొడుతున్నారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో సబలెంకా 6-2, 6-2తో ఉచిజిమా(జపాన్)పై అలవోక విజయం సాధించింది. గంటా రెండు నిమిషాల పాటు సాగిన పోరులో సబలెంకా ఆది నుంచే తనదైన ఆధిపత్యం ప్రదర్శించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి రెండో రౌండ్‌కు చేరిన ఉచిజిమా.. రెండో సీడ్ సబలెంకా ముందు నిలువలేకపోయింది. మ్యాచ్‌లో రెండు ఏస్‌లు సంధించిన సబలెంకా 27 విన్నర్లతో ఆకట్టుకుంది. 12 సార్లు అనవసర తప్పిదాలకు పాల్పడిన ఉచిజిమా 10 విన్నర్లకే పరిమితమైంది. మూడో రౌండ్‌లో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ బడోసాతో సబలెంకాతో తలపడనుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ నోవాక్ జొకోవిచ్ రెండో రౌండ్ పోరులో 6-4, 6-1, 6-2తో కార్బల్లెస్ బయెన(స్పెయిన్)పై అలవోక విజయం సాధించాడు. రెండు గంటల పాటు సాగిన పోరును జొకోవిచ్ వరుస సెట్లలో కైవసం చేసుకున్నాడు. మ్యాచ్‌లో జొకోవిచ్ 5 ఏస్‌లతో పాటు 43 విన్నర్లతో దుమ్మురేపాడు. జ్వెరెవ్ 7-6(7/4), 6-2, 6-2తో గోఫిన్‌పై గెలువగా, మెద్వదెవ్‌కు వాకోవర్ లభించింది. మిగతా మ్యాచ్‌ల్లో స్వితోలినా, రిబకినా, కీస్, హర్కజ్, దిమిత్రోవ్, వొండ్రుసోవా తర్వాత రౌండ్లలోకి ప్రవేశించారు.

దాయాదుల పోరుపైనే

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

మొదటిసారి ఐసీసీ ప్రపంచకప్ టోర్నీలో ఆడే అవకాశంతో పాటు ఆతిథ్య హక్కులను పొందిన అమెరికా. దానికి ఆనుకుని ఉన్న కెనడా. పై రెండు దేశాల మాదిరిగానే సరి హద్దులు పంచుకుంటున్న దాయాదులు భారత్, పాకిస్థాన్. తమదైన రోజున సంచలనాలు నమోదుచేసేందుకు సిద్ధమైన ఐర్లాండ్. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్- ఏలో ఐదు జట్లు ఉన్నప్పటికీ అందరి కండ్లు జూన్ 9న జరుగబోయే దాయాదుల పోరు మీదే!

ఉనికి చాటుకుంటే డబుల్ హ్యాపీ..

తొలిసారి ఐసీసీ ట్రోఫీ బరిలో నిలిచిన అమెరికాపై అంచనాలు లేకపోయినప్పటికీ గ్రూప్ దశలో ఒక్క విజయం నమోదు చేసినా, ప్రత్యర్థులకు కనీసం పోటీనిచ్చినా అది ఆ జట్టుతో పాటు అగ్రరాజ్యాన క్రికెట్‌కూ మంచి చేసేదే. ఇటీవలే 2-1తో బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నెగ్గడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కోరె అండర్సన్, నిసర్గ పటేల్, స్టీవెన్ టేలర్ వంటి స్టార్లు ఉన్న అమెరికా.. సొంత ప్రేక్షకుల నడుమ ప్రత్యర్థులకు పోటీనివ్వాలని తహతహలాడుతోంది.

పోటీనిస్తారా?

2011 వన్డే వరల్డ్ కప్‌లో ఆడిన అనుభవం ఉన్న కెనడాకు ఇదే మొదటి పొట్టి ప్రపంచకప్. ఈ జట్టులోనూ'వలస క్రికెటర్లు' లెక్కకుమించే ఉన్నారు. అదీగాక అందరూ 'థర్టీ ప్లస్' బాపతే. ప్రత్యర్థి జట్లు తమపై భారీ స్కోరు కొట్టకుండా కాపాడుకోగలిగితే అదే పదివేలు.

సంచలనాల ఐర్లాండ్

ఏడోసారి ఈ టోర్నీలో ఆడుతున్న ఐర్లాండ్ గత కొన్నాళ్లుగా బాగా మెరుగయ్యింది. ఫ్రాంచైజీ క్రికెట్ పుణ్యమా అని ఆ జట్టు ఆట గాళ్లు లీగ్‌లలో ఇరగదీస్తున్నారు. అనుభవజ్ఞుడైన పాల్ స్టిర్లింగ్ సారథ్యంలో.. హ్యారీ టెక్టర్, లొర్కన్ టక్కర్, రాస్ అడైర్, కర్టిస్ కంఫర్ వంటి బ్యాటర్లతో ఆ జట్టు బలంగానే ఉంది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఆడే జోషువా లిటిల్, మార్క్ అడైర్ ఇప్పటికే తామేమిటో నిరూపించుకున్నారు. ఏదైనా సంచలనం నమోదైతే ఐర్లాండ్.. సూపర్-8కు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

నిలకడలేని పాక్

అస్థిరతకు మారుపేరైన పాకిస్థాన్ మరోసారి ఐసీసీ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. 2009లో విజేతగా నిలిచిన పాక్.. వన్డే ప్రపంచకప్ తర్వాత వద్దనుకున్న బాబర్ ఆజమ్ సారథ్యంలోనే మళ్లీ బరిలోకి దిగుతోంది. భారత్‌కు వన్డే వరల్డ్ కప్ అందించిన గ్యారీ కిర్‌స్టెన్‌పై ఆ జట్టు భారీ ఆశలే పెట్టుకుంది. రిజ్వాన్, బాబర్, ఫకర్, ఇఫ్తికార్, ఇమాద్ వసీం వంటి అనుభవజ్ఞులైన బ్యాటర్లు ఉన్నా కీలక మ్యాచ్‌లలో వీళ్లు ఏ మేరకు రాణిస్తారనేదే ప్రశ్నార్థకం. పాక్ బ్యాటింగ్ కంటే బౌలింగ్ దళం దుర్బేధ్యంగా ఉంది. షహీన్ అఫ్రిది, నసీమ్ షా, హరీస్ రౌఫ్‌తో పాటు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు తిరిగొచ్చిన మహ్మద్ అమీర్ ఆ జట్టుకు కీలకం. 2021లో సెమీస్, 2022లో ఫైనల్ చేరిన ఆ జట్టు ఈసారైనా 2009ని పునరావృతం చేయాలని భావిస్తోంది. సెమీస్ చేరడం కష్టమేమీ కాకున్నా భారత్‌తో మ్యాచ్‌లో ఎలా ఆడతారన్నది కీలకం.

11 ఏండ్ల కరువును పారదోలేనా?

ఈ గ్రూప్‌తో పాటు టోర్నీలోనూ 'టైటిల్ ఫేవరేట్'గా ఉన్న భారత క్రికెట్ జట్టు.. 11 ఏండ్ల ఐసీసీ ట్రోఫీ కరువును పారదోలేందుకు మరో అవకాశం. 2022 టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ ఓటమి, 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్ పరాభవాన్ని మరిచిపోయి ఈ ఏడాది కప్పుకొట్టాలనే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగుతోంది. ఏదైనా 'మహాద్భుతం' జరిగితే తప్ప టీమ్‌ఇండియా సెమీస్ బెర్తు దాదాపు ఖాయమైనట్టే. అనుభవజ్ఞులు, యువకులతో కలగలిసిన 'మెన్ ఇన్ బ్లూ'కు గ్రూప్-ఏలో అంతో ఇంతో పోటీనిచ్చే జట్టు ఏదైనా ఉందంటే అది బాబర్ సేన మాత్రమే. ఐసీసీ టోర్నీలలో పాక్‌పై భారత్‌కు మంచి రికార్డు ఉండటం మనకు కలిసొచ్చేదే అయినప్పటికీ బంతిని రెండువైపులా స్వింగ్ చేసే అమిర్, అఫ్రిది, నసీమ్ వంటి పేసర్లు ఉండటం మన బ్యాటర్లకు సవాలే. రోహిత్, కోహ్లీ, జైస్వాల్, సూర్యకుమార్, పంత్, శివమ్ దూబే వంటి బ్యాటర్లు.. చాహల్, కుల్దీప్ రూపంలో బంతిని గింగిరాలు తిప్పే స్పిన్నర్లు.. జడేజా, హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్లు భారత్ సొంతం. పేసర్లలో బుమ్రాకు తోడుగా అర్ష్‌దీప్, సిరాజ్ రాణిస్తే రోహిత్ సేనకు ఫైనల్ చేరడం పెద్ద కష్టమేమీ కాదు.

గ్రూప్-ఏ

భారత్
పాకిస్థాన్
ఐర్లాండ్
యూఎస్ఏ
కెనడా

భారత్-పాక్ మ్యాచ్‌కు భద్రత పెంపు

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జూన్ 9న భారత్-పాక్ మ్యాచ్‌కు ఉగ్ర ముప్పు ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో న్యూయార్క్ పోలీసులు ఈ మ్యాచ్‌కు భద్రతను పెంచారు. నసావు స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని న్యూయార్క్ గవర్నర్ క్యాతి హోచుల్ తెలిపారు. మ్యాచ్ జరిగే పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచాలని ఈ మేరకు న్యూయార్క్ పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు.

కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాక్

నార్వే: దిగ్గజ చెస్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్‌కు భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేశ్‌బాబు మరోసారి షాకిచ్చాడు. కార్ల్‌సన్ సొంతగడ్డ నార్వేలో జరుగుతున్న

నార్వే చెస్ టోర్నీలో అన్నా చెల్లెల్ల ముందంజ

నార్వే చెస్ 2024 టోర్నీలో భాగంగా క్లాసికల్ విభాగంలో అతడిని తొలిసారి ఓడించాడు. మూడో రౌండ్‌లో తెల్లపావులతో బరిలోకి దిగిన ప్రజ్ఞానంద.. 37 ఎత్తుల్లో కార్ల్‌సన్‌ను చిత్తుచేశాడు. ఈ విజయంతో అతడు 5.5 పాయింట్లతో అందరికంటే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద సోదరి వైశాలి సైతం మూడు మ్యాచ్‌లలో ఒకటి గెలిచి రెండింటినీ డ్రా చేసుకుని 5.5 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది.

ఒలింపిక్ సంఘం ఎన్నికలకు హైకోర్టు స్టే

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్(టీవోఏ) ఎన్నికలకు బ్రేక్ పడింది. ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జీపీ పాల్గుణ దాఖలు చేసిన పిటీషన్‌ను గురువారం హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నెల 19వ తేదీని విడుదలైన టీవోఏ ఎన్నికల ఎలక్టోరల్ జాబితాలో ఫుట్‌బాల్ సంఘాన్ని తీసివేయడాన్ని సవాలు చేస్తూ పాల్గుణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పిల్‌ను స్వీకరించిన న్యాయస్థానం..ఎన్నికల ప్రక్రియ స్టేటస్‌కో విధించింది.

క్వార్టర్స్‌లో రతికా సీలన్

హాంకాంగ్: భారత యువ టీటీ ప్లేయర్ రతికా సీలన్ హాంకాంగ్ వేదికగా జరుగుతున్న పీఎస్ఎ చాలెంజ్ కప్‌లో క్వార్టర్స్‌కు చేరింది. రెండో రౌండ్‌లో ఆరో సీడ్ రతికా 3-2 (4-11, 5-11, 11-4, 11-4, 11-7)తో హాంకాంగ్‌కే చెందిన క హువెన్ లియోంగ్‌ను ఓడించింది. తమిళనాడుకు చెందిన రతికా.. క్వార్టర్స్‌లో మలేషియా ప్యాడ్లర్ సెహ్వీట్రతో తలపడనుంది.

సచిన్, సంజీత్ ముందంజ

బ్యాంకాక్: పారిస్ ఒలింపిక్స్‌కు బెర్తులు నిర్ణయించే బాక్సింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత యువ బాక్సర్లు అదరగొడుతున్నారు. బ్యాంకాక్ వేదికగా గురువారం జరిగిన పురుషుల 57 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 92 కిలోల కేటగిరీలో సంజీత్ కుమార్, అమిత్ పంగల్ (51కిలోలు), జైస్మిన్ (మహిళల 57 కిలోలు) ప్రిక్వార్టర్స్ పోరులో విజయాలు సాధించి పారిస్ బెర్తుకు సమీపంలో నిలిచారు. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరితే బాక్సర్లకు పారిస్ కోటా దక్కుతుంది.

ఆగస్టులో యూటీటీ టోర్నీ



న్యూఢిల్లీ: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ) ఐదో సీజన్ ఆగస్టులో చెన్నై వేదికగా జరుగనుంది. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరుగనున్న ఈ సీజన్‌లో రెండు కొత్త జట్లు జైపూర్ పేట్రియాట్స్, అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్ పోటీపడుతాయని నిర్వహకులు గురువారం పేర్కొన్నారు. 2017లో మొదలైన ఈ లీగ్‌లో ఇప్పటి వరకు నాలుగు సీజన్లు ముగిశాయి. గత సీజన్‌లో గోవా చాలెంజర్స్ విజేతగా నిలిచింది. ప్రతి జట్టులో ఇద్దరు విదేశీ ప్లేయర్లతో సహా ఆరుగురు ఉంటారు. జట్లు ఎనిమిదికి చేరుకోవడంతో రానున్న సీజన్‌లో ఫార్మాట్‌లో మార్పులు చేశారు.

ఖాళీ బిందెలతో రాస్తారోకో

భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్‌లో 20 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు గురువారం ఖాళీ బిందెలతో ఖమ్మం-కొత్తగూడెం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. ఎస్సై జీవన్‌రాజు వచ్చి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. -జూలూరుపాడు

గుండెపోటుతో కండక్టర్ మృతి

కాల్వశ్రీరాంపూర్, మే 30: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన కారంపూడి శంకర్ (57) కరీంనగర్-2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం కరీంనగర్ నుంచి (టీఎస్ 020 బీ 0611) బస్సులో కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లాడు. రాత్రి మండల కేంద్రంలోనే డ్రైవర్‌తో కలిసి నైట్‌హాల్ట్ చేశాడు. రాత్రి 2 గంటల సమయంలో ఛాతీలో నొప్పి వస్తున్నదని డ్రైవర్ రాకేశ్‌కు చెప్పాడు. అప్రమత్తమైన డ్రైవర్ శంకర్‌ను ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాడు. చికిత్స తర్వాత లేచి కొద్దిదూరం నడిచిన శంకర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. ఎస్సై ఓంకార్‌యాదవ్ మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శంకర్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆర్టీసీ డీఎం మల్లయ్య, అసిస్టెంట్ డీఎం విజయమ్మ, సెక్యూరిటీ అధికారి లక్ష్మారెడ్డి కాల్వశ్రీరాంపూర్‌కు చేరుకొని శంకర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

కేటీపీపీలో నిలిచిపోయిన విద్యుత్తు ఉత్పత్తి

గణపురం, మే 30 : కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లోని 500 మెగావాట్ల ప్లాంట్‌లో గురువారం విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. సాంకేతిక లోపం తలెత్తి బాయిలర్ ట్యూబులు లీకేజీ కావడంతో ఉత్పత్తి నిలిచిపోయినట్టు తెలిసింది. సమస్యను పరిష్కరించేందుకు జెన్కో ఇంజినీరింగ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

- ఉపాధి పనుల్లో 'గుప్తనిధి'

సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న చల్లా కవితకు ఓ రాతి పెట్టె దొరుకగా గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెట్టెలో 25 వెండి నాణేలు, 2 వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి. క్రీ.శ 1658-1707కు చెందినవని చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.
-మద్దూరు (ఘాళిమిట్ట) మే, 30

తేనెటీగల దాడిలో రైతు మృతి

గండీడ్, మే 30: మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం లింగాయిపల్లికి చెందిన జీడీ వెంకట్‌రాములు (40) మూడ్రోజుల కిందట పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మెదడుకు వాపు వచ్చి గురువారం మృతి చెందాడు.

ఆలయ మండపంలో దీక్ష విరమణ చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

కొండగట్టు..కాషాయ శోభితం

- ఘనంగా ప్రారంభమైన హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు

మల్యాల, మే 30 : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు, వేదపండితులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి, ఉపప్రధాన అర్చకులు గోపాలకృష్ణాచార్యులు, అర్చకులు అమరవాది వెంకటరాఘవన్ ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆమెకు ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, ఉత్సవ ప్రత్యేకాధికారి వినోద్‌రెడ్డి నేతృత్వంలో భక్తులు ఎదుర్కోళ్లతో అపూర్వ స్వాగతం పలికారు. కళాకారుల కోలాటాలు, ఒగ్గుడోలు విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ భద్రాద్రి ఆలయ పట్టువస్త్రాలను ఎదుర్కొన్నారు. అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆశీర్వచన మండపంలో ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించిన భద్రాద్రి ఆలయ అధికారులు, అర్చకులను హనుమాన్ ఆలయ కమిటీ ఘనంగా సత్కరించగా అర్చకులు పూజలు చేయించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఉత్సవాల తొలిరోజే మాల విరమణ మండపాన్ని తెరిచారు. పెద్దసంఖ్యలో దీక్షాపరులు దీక్షలను విరమించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఉండవెల్లి, మే 30: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఉండవెల్లి మండలం మారమునగాల-2కు చెందిన ఒనూరు బాషా (45) తనకున్న ఆరెకరాలతోపాటు అదనంగా పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నాడు. ఈ ఏడాది ఇప్పటికే వర్షాలు పలుకరించగా.. వేణుగోపాల్‌రెడ్డికి చెందిన 10 ఎకరాల భూమిని రూ.లక్షా 50 వేలకు కౌలుకు తీసుకున్నాడు. గురువారం కౌలు పొలం దున్నేందుకు బాషా తన కొడుకు షేక్షావలి, ట్రాక్టర్ డ్రైవర్ రాజుతో కలిసి పొలం దగ్గరికి వెళ్లాడు. దుక్కి దున్నే క్రమంలో వేలాడుతున్న విద్యుత్తు తీగలు ట్రాక్టర్‌కు తగలకుండా కట్టె సాయంతో పైకిలేపాడు. ఆ సమయంలో త్రీఫేస్‌లోని ఒక తీగ తెగి బాషా చేతిపై పడి షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని ఏపీలోని కర్నూల్ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య షాలీబీతోపాటు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.